

ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అభివృద్ధిని గమనించండి.. 'సండ్ర'ను ఆశీర్వదించండి..

### సత్తుపల్లి 1వ వార్డు ఇంటింటికీ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

సత్తుపల్లి, అక్టోబర్ 1: సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 1వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ నాయకులు ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే సండ్రను గెలిపించాలని కోరారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యే సండ్ర ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఎమ్మెల్యే సండ్రను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. డీసీసీబీ డైరెక్టర్ చల్లగుళ్ల కృష్ణయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రఫీ, వల్లభనేని పవన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న రేషన్ డీలర్లు

కల్లూరు, అక్టోబర్ 13: కల్లూరు తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పులి సాంబశివుడును శుక్రవారం ఖమ్మం జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సింగిశాల ప్రసాద్ ఆధ్వర్యంలో రేషన్‌డీలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. డీలర్ల సంఘ నాయకులు జంగా పద్మావతి, వెంకటేశ్వరరెడ్డి, ఉబ్బన జ్యోతి, కాటేపల్లి రజనీకాంత్, కనకదుర్గ, రామారావు, నాగేశ్వరరావు, వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలకు ముస్తాబవుతున్న పల్లెలు



తాళ్లపెంటలో సంబురాలకు సిద్ధమైన మండపం

పెనుబల్లి, అక్టోబర్ 13: దేవీ శరన్నవరాత్రులు బతుకమ్మ ఉత్సవాలకు గ్రామాలు సిద్ధమతున్నాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అమ్మవారిని కొలువు తీర్చేందుకు ప్రత్యేక మండపాలను సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా గ్రామాల్లోని అమ్మవారి దేవాలయాలకు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో రంగులు వేసి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

## పండుగలు మన సంస్కృతికి ప్రతీకలు: ఆర్టీసీ డీఎం

సత్తుపల్లి టౌన్, అక్టోబర్ 13: పండుగలు.. మన సంస్కృతీ సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను తెలియచేస్తాయని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉత్సవాల్లో శుక్రవారం ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వివిధ రకాల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను తీర్చిదిద్ది కోలాటం చేస్తూ పాటలుపాడారు. అనంతరం నవరాత్రి వేడుకల్లో భాగంగా దుర్గాదేవికి దశావతారాల గురించి నిర్వహించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబురాల్లో చిన్నారులు

# 'సత్తుపల్లి'కి నర్సింగ్ కళాశాల

- నియోజకవర్గంలో పేద విద్యార్థులకు వరం
- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృషి ఫలితం

సత్తుపల్లి రూరల్, అక్టోబర్ 13: రాష్ట్ర ప్రభుత్వం వైద్యవిద్యతోపాటు నర్సింగ్ విద్యకు పెద్దపీట వేస్తోంది. సర్కారు దవాఖానల్లో నర్సుల కొరతను అధిగమించేందుకు నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక దృష్టి సారించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించడంతో నియోజకవర్గ కేంద్రానికి నర్సింగ్ కళాశాల మంజూరు చేశారు. ఈ మేరకు రూ.25 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభమయ్యేలా ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వ వైద్యంలో నాణ్యతా ప్రమాణాల మెరుగు కోసం రాష్ట్ర సర్కారు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే వైద్య కళాశాలతోపాటు నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లిలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చొరవతో ఏర్పాటుకానున్న ఈ నర్సింగ్ కళాశాల ఈ ప్రాంత పేద విద్యార్థుల పాలిట వరంగా మారనుంది.



నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయబోయే ప్రైవేటు కళాశాల భవనం

గతంలో పేద, మధ్యతరగతి విద్యార్థులు నర్సింగ్ విద్య అందుబాటులో లేకపోవడంతో ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో సత్తుపల్లిలోని నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయనుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**కిష్టారంలో ఏర్పాటుకు చర్యలు..**

నర్సింగ్ కళాశాల ప్రభుత్వం మంజూరు చేయడంతో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించాలని నిర్ణయించడంతో సత్తుపల్లిలో అనువైన స్థలం లేకపోవడంతో కిష్టారంలోని ఓ ప్రైవేటు బిల్డింగ్‌ను అద్దెకు తీసుకుని ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మొత్తం 60 సీట్లు ఈ నర్సింగ్ కళాశాలలో ఉండనుండగా 15 మంది అధ్యాపకులు, ఐదుగురు ఆఫీస్ సిబ్బందిని నియమించనున్నారు.

### కళాశాల కల సాకారమైంది



సమాజానికి మహిళలు, బాలికలే మొదటి మెట్టు. అందుకే ప్రతి విషయంలోనూ మహిళలకే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. సత్తుపల్లిలో పాలిటెక్నిక్ కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్నది నా కల. ముఖ్యమంత్రి ఆశీస్సులతో ఆ కల నెరవేరింది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

–ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

# పనులు వేగవంతం చేయాలి

### కల్లూరు ముఖ్యమంత్రి సభా ఏర్పాట్ల పరిశీలనలో ఎమ్మెల్యే సండ్ర



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సండ్ర, నాయకులు

కల్లూరు, అక్టోబర్ 13: సీఎం పర్యటన నేపథ్యంలో కల్లూరులో జరుగనున్న సభ కోసం జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కల్లూరులో పర్యటించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నవంబర్ 1న ముఖ్యమంత్రి కేసీఆర్ కల్లూరులోని ఎన్ఎస్‌పీ క్రాస్‌రోడ్‌లోని మారుతినగర్‌లో బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ సభా స్థలాన్ని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. మారుతినగర్‌లో సుమారు 50 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని కేసీఆర్ బహిరంగ సభకు నిర్ణయించడంతో ఆయన పరిశీలించి నాయకులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రాకతో వాహనాల పార్కింగ్, బహిరంగ సభ స్థలం, హెలిప్యాడ్ ఏర్పాట్లను వేగవంతం చేయాలని నాయకులను ఆదేశించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాలెపు రామారావు, కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, బోబోలు లక్ష్మణరావు, కొరకొప్పు ప్రసాద్, ఎండీ ఇస్మాయిల్, పెడకంటి రామకృష్ణ, షేక్ కమ్లీ, అజ్మీరా జమలయ్య, కాటంనేని వెంకటేశ్వరరావు, ఖమ్మంపాటి పుల్లాచారి, పసుపులేటి శ్రీనివాసరావు, శీలంశెట్టి కిరణ్‌కుమార్, బైర్ల కాంతారావు, రాచమళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల నగదు సీజ్



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖమ్మం రూరల్, అక్టోబర్ 13: ఖమ్మం రూరల్ మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్ వద్ద శుక్రవారం సాయంత్రం ఖమ్మం రూరల్ ఎస్‌హెచ్‌వో వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఖమ్మం రూరల్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని గుర్రాలపాడు నుంచి ఖమ్మం వైపు వస్తున్న ఓ కారును ఆపి సోదా చేశారు. అందులో రూ.3 లక్షల నగదును గుర్తించి వాహనంలో ప్రయాణిస్తున్న వారిని నగదుకు సంబంధించిన ఆధారాలు ఆడిగారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.

# 'సీ విజిల్'పై విస్తృత అవగాహన కల్పించాలి

### ఎన్నికల సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి: ఆర్డీవో



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న ఆర్డీవో అశోక్‌చక్రవర్తి

సత్తుపల్లి/ వేంసూరు, అక్టోబర్ 13: కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా రూపొందించిన సీ విజిల్ యాప్‌పై గ్రామాల్లో, వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీవో అశోకచక్రవర్తి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వార్డుల్లో, గ్రామాల్లో కనీసం 20 మందితో ఈ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా ఓటరు లిస్టులో చనిపోయిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. ఎన్నికల సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఎన్నికల డీటీ సుధీర్, ఆర్ఐలు నరేశ్, జానిమియా పాల్గొన్నారు.

**ఓటు నమోదుపై దృష్టిసారించాలి**

కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 31 వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించినందున గ్రామాల్లో యువతీయువకులకు అవగాహన కల్పించాలని ఆర్డీవో అశోకచక్రవర్తి బీఎల్‌వోలకు సూచించారు. వేంసూరు రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఎంపీడీవో రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అశోకచక్రవర్తి